

గోదావరి ఝరిలా గాత్రకచేరి

చీరాల అర్బన్: సంగీత సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో భాగంగా చీరాలలో శనివారం రాత్రి చెన్నైకు చెందిన ఆదిత్య మాధవన్ గాత్ర కచేరి నిర్వహించారు.



జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి శనివారం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు.

కట్టుదిట్టంగా ఎన్నికల భద్రత

- ఏఎన్‌యూలో గుంటూరు పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి
- జిల్లా యంత్రాంగంతో కలసి వసతుల పరిశీలన

ఏఎన్‌యూ : సార్వత్రిక ఎన్నికల ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో పగడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. దీనిలో భాగంగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి జిల్లా యంత్రాంగంతో కలసి శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పర్యటించారు. యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలోని భవనాలలో మౌలిక వసతులు పరిశీలించారు. గుంటూరు పార్లమెంట్, పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనుంది. వాటికి కావాల్సిన మౌలిక వసతులు ఇంజినీరింగ్ కళాశాలలో ఏ మేరకు ఉన్నాయి, వాటిలో ఏం మార్పులు చేయాలనే అంశాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ కళాశాలలోని సెంట్రల్ బ్లాక్, మెకానికల్ ఇంజినీరింగ్, ఈసీఈ, ట్రిపుల్ ఈ భవనాలు, ఆర్కిటెక్చర్ కళాశాలలో అన్ని గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు, నియోజకవర్గాల వారీగా గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు, తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు భద్రపరచడం, కౌంటింగ్ కేంద్రాలకు అవసరమైన గదుల నంబర్లు, కొలతలు సేకరించారు. ఈవీఎంలు సులభంగా కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్లే విధంగా స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆయా భవనాల మ్యాప్‌లను పరిశీలించి ఏ వసతులు ఎక్కడ కల్పించాలనే దానిపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వీటితోపాటు నియోజకవర్గాల వారీగా కౌంటింగ్‌కు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు లోపలికి ప్రవేశించడం, బయటకు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సిబ్బంది, ఏజెంట్లకు ఇబ్బంది కలుగకుండా రద్దీ తలెత్తకుండా ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంతోపాటు, భవనాల్లో కూడా బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వీటితోపాటు ఎన్నికల పరిశీలకులు, ఇతర పర్యవేక్షకులకు ప్రత్యేక గదులు ఎక్కడ ఏర్పాటు చేయాలనేది గుర్తించారు. స్టాట్యూటరీ రూమ్స్ తదితర గదులు ఎక్కడెక్కడ ఉండాలనేది నిర్ణయించారు. ఫుడ్ కోర్ట్ ఏర్పాటు, తాగు నీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో చేపట్టాల్సిన చర్యలపై జేసీ జి రాజకుమారి, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, స్పెషల్ కలెక్టర్ కె స్వాతి, రవీంద్రరావు, గుంటూరు ఆర్డీఓ శ్రీకర్, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖార్ జైన్‌లతో కలెక్టర్ చర్చించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటి నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని విషయాల్లో జాగ్రత్త వహించాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. భవనాల్లో ఆయా గదుల్లో ఉన్న వస్తువులను వీలైనంత త్వరగా తీసివేసి గదులన్నీ పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని యూనివర్సిటీ అధికారులకు కలెక్టర్ సూచించారు. పలువురు తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎన్‌యూలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి

మహాత్ముని విగ్రహం కలెక్టరేట్‌కు ఆభరణం

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరువెస్ట్: జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మహాత్ముడి విగ్రహాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ అహింసనే వజ్రాయుధంగా చేసుకుని స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీ ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఈ విగ్రహంతో కలెక్టరేట్‌కు మరింత వన్నె వస్తుందన్నారు. విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక చేయూతనందించిన బొమ్మిడాల ట్రస్ట్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో జేసీ రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, కలెక్టరేట్ ఏఓ పూర్ణచంద్రరావు అధికారులు పాల్గొన్నారు.



మహాత్మ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి తదితరులు

విజ్ఞాన్ మహోత్సవానికి తెర

నచ్చిన రంగంలో రాణించేందుకు కృషి చేయండి

- విద్యార్థి లోకానికి నటుడు కిరణ్ అబ్బవరం పిలుపు
- ముఖ్య అతిథులుగా టీం ఇండియా మాజీ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, సినీ రచయిత బుర్రా సాయి మాధవ్

చేబ్రోలు: విద్యార్థులు మీకు ఏ రంగంలో ఇష్టం ఉంటే ఆ రంగంలోకి రాణించేందుకు కృషి చేయాలని సినీ నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడురోజులపాటు నిర్వహించిన జాతీయస్థాయి మహోత్సవం శనివారం ముగిసింది. ఆటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ట్రోఫీలు, రూ.15 లక్షల నగదు బహుమతులు అందజేశారు. నటుడు కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడు నవ్వుతూ సంతోషంగా ఉండాలన్నారు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ... వీలైనంత వరకు పక్క వాళ్లతో సంతోషంగా గడపడానికి ప్రయత్నించాలన్నారు. టీం ఇండియా మాజీ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీవితంలో నిర్ధిష్టమైన లక్ష్యం ఉండాలని, దాని సాధించేంతవరకు అవిశ్రాంతంగా కష్టపడాలన్నారు. సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ రైటర్, డైరెక్టర్, యాక్టర్, డాక్టర్, పొలిటీషియన్, ఇంజినీర్ ఉంటారని... అందులో మీలో ఎవరున్నారనది మీకే తెలియలన్నారు. నాలో రైటర్ ఉన్నాడని నాకు తెలిసింది కాబట్టే నేను రైటర్ అయ్యానని వెల్లడించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో 75 ఈవెంట్లను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులతోపాటు ట్రోఫీలు అందజేశారు. క్రికెట్ చాంపియన్‌షిప్‌లో తిరుపతి ఎస్వీ కాలేజీ విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతి సాధించింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో కేఎల్‌యూ, ఎస్ఆర్ఎం-ఏపీ జట్లు నిలిచాయి. వందకుపైగా విద్యాసంస్థల నుంచి 10వేల మందికి పైగా విద్యార్థులు ఆయా క్రీడాంశాల్లో పాల్గొన్నారు.



కబడ్డీలో ట్రోఫీ సాధించిన విజ్ఞాన్ బాలికల జట్టుతో భారత క్రికెట్ జట్టు మాజీ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, చైర్మన్ రత్తయ్య, నటుడు కిరణ్ అబ్బవరం

మెరిసిన మట్టిలో మాణిక్యాలు



కబడ్డీలో మొదటి బహుమతి సాధించిన మంగళగిరి మహిళల జట్టు

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీలు
- విజేతలకు బహుమతులు పంపిణీ

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత భారీగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీల్లో ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ క్రీడా సాధన నిరంతరం చేయాలన్నారు. మొత్తం ఐదు క్రీడలు క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖోఖో, కబడ్డీ నిర్వహించిన వాటిలో యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. జిల్లాలో మొత్తం 1,45,929 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు నిర్వహించిన క్రీడా పోటీలు నిర్విరామంగా 39 రోజులు కొనసాగాయన్నారు. గ్రామ స్థాయిలో 6212, మండల స్థాయిలో 5403, నియోజకవర్గ స్థాయిలో 190 పోటీలు అహ్లాదకరమైన వాతావరణలో నిర్వహించామన్నారు. పెద్ద ఎత్తుక క్రీడా పోటీలను ప్రజలు తిలకించారని చెప్పారు. పోటీల నిర్వహణకు ఎంతో మంది కృషి ఉందన్నారు.

విద్యార్థి దశలోనే క్రీడా సాధన చేయాలి: జేసీ రాజకుమారి

కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడా సాధన చేసే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి బహుమతి కింద రూ.60 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతికి రూ.10 అందజేసామన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు జి.నిత్య సంతోషిణి, ఎస్.రవిబాబు, రామకృష్ణ సాకేత్, వి.భార్గవి, బాలాజీ నాయక్‌లను సత్కరించారు. అనంతరం కలెక్టర్, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



క్రికెట్‌లో మొదటి బహుమతి సాధించిన పురుషుల గుంటూరు పశ్చిమ జట్టు

విజేతల వివరాలు..

మహిళలు బ్యాడ్మింటన్: వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను తాడికొండ, ప్రత్తిపాడు, తెనాలి జట్లు సాధించాయి.

క్రికెట్ : పొన్నూరు, తెనాలి, తాడికొండ. **కబడ్డీ:** మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, మంగళగిరి, **ఖోఖో:** పొన్నూరు, ప్రత్తిపాడు, మంగళగిరి, **వాలీబాల్** : మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు.

పురుషులు.. బ్యాడ్మింటన్‌లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గుంటూరు వెస్ట్, ప్రత్తిపాడు, మంగళగిరి,

క్రికెట్: గుంటూరు వెస్ట్, పొన్నూరు, ప్రత్తిపాడు. **కబడ్డీ:** పొన్నూరు, మంగళగిరి, ప్రత్తిపాడు, **ఖో-ఖో:** మంగళగిరి, గుంటూరు వెస్ట్, ప్రత్తిపాడు. **వాలీబాల్:** తెనాలి, తాడికొండ, ప్రత్తిపాడు.



బ్యాడ్మింటన్‌లో మొదటి బహుమతి సాధించిన తాడికొండ మహిళా జట్టు



వాలీబాల్‌లో మొదటి బహుమతి సాధించిన పురుషుల తెనాలి జట్టు

రేపు ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులకు కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్నవారి మెరిట్ లిస్టును విడుదల చేశామని గుంటూరు ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేశామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈనెల 5న ఉదయం 10 గంటలకు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించారు.

సీఎం జగన్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు



కళ్లజోళ్లు అందుకున్న గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో 705 మందికి కళ్లజోళ్లు పంపిణీ

చేబ్రోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వెల్లడించారు చేబ్రోలులో శనివారం 705 మంది గ్రామస్తులకు కళ్లజోళ్ల పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమంలో భాగంగా గత నెల 25వ తేదీన ఆ గ్రామంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద వైద్య శిబిరాలను నిర్వహించామని.. బజరంగ్ 'నేత్రజ్యోతి' శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న గ్రామస్తులలో 705 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించిన మీదట వారందరికీ ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో శిబిరం వివరాలను మురళీకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

నాగరత్నమ్మ పురస్కారం పూర్వజన్మ సుకృతం



పద్మశ్రీ షేక్ కాలేషాబి, మహబూబ్ సుభాని దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాత గుంటూరు: తమ జీవితాన్ని సాహిత్య, కళా పోషణకు అంకితం చేసిన విద్యా సుందరి బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం అందుకోవటం పూర్వజన్మ సుకృతమని తమిళనాడులోని శ్రీరంగంకు చెందిన సుప్రసిద్ధ నాదస్వర విద్వాంస దంపతులు పద్మశ్రీ, షేక్ మహబూబ్ సుభాని, కాలేషాబీ దంపతులు పేర్కొన్నారు. శనివారం స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విద్యాసుందరి బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం ప్రదానం సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీవీఐటీ విద్యాసంస్థల ట్రస్ట్ బోర్డు సభ్యురాలు వాసిరెడ్డి అరుణ ప్రియ పాల్గొన్నారు.